క్లుప్తంగా

ప్రమాదాల నివారణకు చర్యలు



దేవాది వద్ద రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

నరసన్నపేట: జాతీయ రహదారిపై దేవాది కూడలి, నడగం–ముద్దాడపేట మధ్య రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్అండ్బీ ఏఈ శ్రీనివాసరావు, టెక్కలి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంజీవరావు అన్నారు. గురువారం స్థానిక ఎస్ఐ దుర్గాప్రసాద్, నేషనల్ హైవే ఇంజినీర్ కిరణ్కుమార్, ఆర్ఐ సాయిరాంతో కలిసి ప్రమాద స్థలాలను పరిశీలించారు. దేవాది వద్ద సర్వీసు రోడ్డు నుంచి హైవే పైకి వెళ్లే చోట ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇక్కడ స్పీడ్ బ్రేకర్ వేయాలని నిర్ణయించారు. రాత్రి సమయాల్లో లైటింగ్ సదుపాయం అవసరాన్ని గుర్తించారు. నడగాం దాటిన తరువాత ములుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో అక్కడ ఉన్న జంగిల్ను తొలగించాలని, రోడ్డు రెన్యువల్ కోటింగ్ వేయడానికి నిర్ణయించారు. ఈ మేరకు పైఅధికారులకు నివేదిక పంపుతామని ఆర్అండ్బీ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

సమ్మె విజయవంతం చేయండి



వాల్ పోస్టర్ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

నరసన్నపేట: ఈ నెల 20వ తేదీన ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎల్ఐసీ ఉద్యోగులు దేశవ్యాప్త సమ్మె చేయనున్నారని నరసన్నపేట ఎల్ఐసీ బ్రాంచ్ అధ్యక్షుడు ఆర్.సురేష్బాబు గురువారం తెలిపారు. ఈ సమ్మెలో ఎల్ఐసీ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్ను భోజన విరామ సమయంలో ఆవిష్కరించారు. అసోసియేషన్ ప్రతినిధులు ఎం.మాధవరావు, డి.బి. శ్రీనివాసరావు, లబ్బ శ్రీనిధి, బి.ఉమామహేశ్వరి, ఎల్.పార్థసారధి, తదితరులు పాల్గొన్నారు.

12న సర్వసభ్య సమావేశం

పొందూరు: ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ మీసాల మన్మధరావు గురువారం తెలిపారు. ఎంపీపీ కిల్లి ఉషారాణి అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి వివరాలతో హాజరు కావాలన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్లు పాల్గొనాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఎంఎస్ఎంఈ పార్క్ పనులకు శంకుస్థాపన చేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్నాయుడు

మెళియాపుట్టి: మండలంలోని పలు అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు గురువారం శంకుస్థాపన చేశారు. సంతలక్ష్మీపురం గ్రామంలోని జీటీరోడ్ నుంచి గంగన్నపేట మీదుగా ప్రధాన మంత్రి నిధులు రూ.2.65కోట్లతో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో ఏపీఐఐసీ ఎంఎస్ఎంఈ పార్క్ అభివృద్ధి పనులకు రూ.6.28 కోట్లతో, నేలబొంతు నుంచి అనంతగిరి వరకు పీఎం జన్మాన్ నిధులు రూ.1.90 కోట్లతో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


భక్తిశ్రద్ధలతో శ్రీముఖలింగేశ్వరుడి తిరువీధి



పార్వతీపరమేశ్వరులను తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వైశాఖ మాసం శుద్ధ ఏకాదశి సందర్భంగా మధుకేశ్వరుడి గురువారం తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను అలంకరించారు. అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా హంస వాహన సేవ



స్వామివారి తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం హంస వాహన సేవ ఘనంగా నిర్వహించారు. పలు పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ అర్చకుడు చామర్తి సత్యసాయి కృష్ణమాచార్యులు, సత్యవరం అర్చకుడు మావుడూరు జగదీష్ బాబు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోతకు గురవుతున్న..

తీరప్రాంతం



పురుషోత్తపురం సమీపంలో కోతకు గురైన భూమి

- కాలగర్భంలో కలిసిపోతున్న జిరాయితీ భూములు
- నదీతీర ప్రాంతాలకు వరద ముప్పు
- నష్టపోతున్న తీరప్రాంత రైతులు



అలమాజీపేట సమీపంలో వరదలకు కొట్టుకుపోయిన గ్రోయిన్

సరుబుజ్జిలి: వర్షం పడిందంటే వంశధార, నాగావళి తీర ప్రాంతాల వాసులకు కంటి మీద కునుకు ఉండడం లేదు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ఏ క్షణాన వరదముంచుకొచ్చి తమ ప్రాణాలు హరించుకుపోతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు. ప్రతీ ఏటా జూలై నుంచి అక్టోబర్ వరకు తీర ప్రాంత వాసులకు ప్రతీ రాత్రి కాల రాత్రిగా మారతుంది. నదీతీర ప్రాంతాల్లో కరకట్టల నిర్మాణాలు ముందుకు సాగకపోవడం, ఇసుక తవ్వకాలు ఇష్టారాజ్యంగా చేయడం వలన ఏ మాత్రం వరద వచ్చినా.. వెంటనే తీర ప్రాంత జనావాసాల్లోకి ప్రవేశించి మనుషులు, పశువులు ప్రాణనష్టంతోపాటు, పంట, ఇళ్ల నష్టాలు కూడా ఏర్పడుతున్నాయి.

ఆమదాలవలస నియోజకవర్గంలో తీరప్రాంతం విస్తీర్ణం, గ్రామాల వివరాలు ..

మండలం	తీరప్రాంత విస్తీర్ణం (కిలో మీటర్లు)	తీర ప్రాంత గ్రామాలు
సరుబుజ్జిలి	16	14
బూర్జ	14	12
పొందూరు	13	11
ఆమదాలవలస	10	13

చిన్న, సన్నకారు రైతులకు తీవ్రనష్టం..

వరదలు సమయంలో తీర ప్రాంతాల్లో ఉన్న జిరాయితీ భూములు ప్రతిఏటా కోతకు గురవుతున్నాయి. అధికంగా భూములు కలిగిన రైతులు చిన్న, సన్నకారు రైతులుగా మారుతున్నారు. విలువైన జిరాయితీ భూములు నదీ గర్భంలో కలిసిపోతున్నాయి. మిగిలిన భూములు ఇసుక మేటలతో కప్పేస్తున్నాయి. దీనివలన ఇసుక మేటలు తొలగించలేక, సాగుచేయలేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

ఈ గ్రామాలకు తిప్పలు..

- ప్రతీ ఏటా వంశధార, నాగావళి నదులకు వరదలు వచ్చే సమయంలో పలు మండలాలకు చెందిన గ్రామాలు నష్టపోతున్నాయి. సరుబుజ్జిలి మండలంలోని అగ్రహారం, పాతపాడు, తెలికిపెంట, యరగాం, కాగితాపల్లి, పెదమాలపేట, పెద్దసవలాపురం, చినవెంకటాపురం, పాలవలస, పురుషోత్తపురం, అలమాజీపేట, ఫకీర్‌సాహెబ్‌పేట గ్రామాలున్నాయి.
- ఆమదాలవలస మండలంలోని నిమ్మతొర్లాడ, కొరపాం, బెలమాం, లొద్దలపేట, ముద్దాడపేట, కలివరం, తొగరాం గ్రామాలున్నాయి.
- పొందూరు మండలంలో సింగూరు, బొడ్డేపల్లి ఉన్నాయి.
- బూర్జ మండలంలో ఖండ్యాం, గుత్తావల్లి, నారాయణపురం గ్రామాలు నష్టాలు చవిచూస్తున్నాయి.

ముందుకు సాగని కరకట్ట పనులు



నది సమీపంలోనే నివసిస్తున్నాం. వర్షా కాలంలో ప్రతి ఏటా వరదలు వస్తున్నాయి. నెలల తరబడి నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం. కనీసం రాతికట్టు (గ్రోయిన్స్) కూడా నిర్మించకపోవడం వలన విలువైన భూములు, ఇళ్లు కోల్పోతున్నాం. దీనివలన ప్రతిఏటా ఇబ్బంది తప్పడంలేదు.

– రావాడ రవికుమార్, యరగాం, సరుబుజ్జిలి

చర్యలు తీసుకుంటాం..

కరకట్ట పనులు పునః ప్రారంభానికి అన్ని చర్యలూ తీసుకొంటాం. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– వాసుదేవరావు, ఈఈ, కరకట్టల విభాగం

ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు పరిశీలన

సారవకోట/జలుమూరు: తిలార్ రైల్వే గేటుపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని జాతీయ రహదారుల డీఈఈ సత్యభాస్కర్ సంబంధిత కాంట్రాక్టర్ను గురువారం సూచించారు. బుధవారం సాక్షిలో ఇంకెన్నాళ్లు అనే శీర్షిక ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆయన ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పరిశీలించి పలు సలహాలు, సూచనలిచ్చారు. ఈ నెలాఖరు నాటికి పనులు పూర్తి చేసి వాహనాల రాక, పోకలు సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు.



ఫ్లైఓవర్పై నిర్మిస్తున్న రోడ్డును పరిశీలిస్తున్న డీఈఈ సత్యభాస్కర్

నవధాన్యాల సాగుతో భూసారం

కొత్తూరు: నవధాన్యాలు సాగుతో భూమి సారవంతంగా తయారవుతుందని ప్రకృతి వ్యవసాయం కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్ మాస్టర్ ట్రైనీ ఎస్.సూర్యనారాయణ, డీపీఎం పి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని సోమరాజపురంలో 12 రకాల విత్తనాలతో రెండు కిలోల బరువు ఉన్న 120 కిట్లును గురువారం తయారుచేసి రైతులకు పంపిణీ చేశారు. నవధాన్యాలను సాగు చేయడం వలన భూమి గుల్లబారి తేమ ఎక్కువ కాలం ఉంటుందన్నారు. కలుపు నివారణను అరికట్టవచ్చన్నారు. పలు రకాల విత్తనాలు వేయడం వలన భూమిలో ఆయా పంటల వేళ్ల విస్తరించడంతో ఎటువంటి పంట సాగు చేసినా అనుకూలంగా ఉంటుందన్నారు. నవధాన్యాల కిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. సర్పంచ్ వాన మల్లేశ్వరి, యూనిట్ ఇన్చార్జి గోవిందరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



నవధాన్యాల కిట్లును పంపిణీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంతో మేలు

పాతపట్నం: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులను పండించవచ్చని, ప్రకృతి సాగు చేస్తున్న రైతులను ప్రోత్సహించాలని ప్రకృతి వ్యవసాయ ఏడీపీఎం ధనుంజయ్ అన్నారు. గురువారం మండలంలోని బి.గోపాలపురంలో గ్రామ సంఘం సభ్యుల సమక్షంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామంలో ఎక్కువ మంది రైతులు సాగు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. ముగ్గురిని ఫుడ్ బాస్కెట్ సబ్ కమిటీ సభ్యులను ఎంపిక చేయడం, పీఎండీఎస్ పద్ధతిలో వ్యవసాయం చేయడం గూర్చి తెలియజేశారు. ఎంఎంఎల్టీ సువర్ణ రాజు, వీఏఏ, వీఓబీ, ఎస్హెచ్జీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీపీఎం ధనుంజయ్

అధ్వానం..



సరుబుజ్జిలి మండలంలో ఏబీ రోడ్డు నుంచి రొట్టవలస–పురుషోత్తపురం ఆర్అండ్బీ రహదారి పాలవలస అధ్వానంగా తయారైంది. రహదారి మొత్తం రాళ్లతేలాయి. ఈ రహదారిలో ప్రయాణం చేసే పాలవలస, రావివలస, అలమాజీపేట, ఫీర్‌సాహెబ్‌పేట గ్రామాలకు చెందిన ఉద్యోగులు, ప్రజలు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

– సరుబుజ్జిలి


నిరీక్షణ..



సరుబుజ్జిలి ఆర్టీసీ బస్టాండ్లోకి బస్సులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. ఆర్టీసీ కంట్రోల్ పోస్టు లేకపోవడం వలన ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల వివరాలు, వేళలు చెప్పేవారు లేరు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉంటున్నారు. సమాధానం చెప్పేవారులేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. తక్షణమే ఆర్టీసీ అధికారులు స్పందించి కంట్రోలర్ పోస్టు ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

రాళ్లు తేలాయి..



సారవకోట నుంచి అన్నుపురం, చిన్నగుజ్జువాడ మీదుగా తెంబూరు వెళ్లే రహదారికి కలిపే మార్గంలో రాళ్లు తేలాయి. ప్రయాణీకులు ప్రమాదం బారిన పడుతున్నారు. తెంబూరు, హిరమండలం రోడ్డు నిర్మాణ పనులు చేసేటప్పుడు సారవకోట నుంచి తెంబూరు వెళ్లే రోడ్డుకు పక్కనే రాళ్ళు వేసి విడిచిపెట్టారు. దీంతో ఆ రాళ్లు రోడ్డుపై తేలిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్అండ్బీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

– సారవకోట

పొంచి ఉన్న ప్రమాదం



కొత్తూరు మండలంలోని కర్లెమ్మ గ్రామ సమీపంలో ఉన్న మద్రిపాడు గెడ్డపై నిర్మించిన కల్వర్టు వద్ద భారీ గొయ్యి ఏర్పడింది. ఈ ప్రాంతంలో మలుపుతోపాటు లోతుగా ఉన్నందున వాహనాలను అదుపు చేయలేని పరిస్థితి. ఆర్అండ్బీ అధికారులు స్పందించి గొయ్యిని వెంటనే పూడ్చాలని పలువురు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో ఇటీవల రోడ్డు మరమ్మతులు చేశారు తప్ప.. కల్వర్టును మాత్రం బాగు చేయకపోవడంతో ఈ దుస్థితికి నెలకొంది.

– కొత్తూరు

రోడ్డుకు అడ్డంగా..

భవన నిర్మాణ సామగ్రి..!

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస మండలం కలివరం గ్రామంలో రోడ్డుకు అడ్డంగా భవన నిర్మాణ సామగ్రిని కొంతమంది వేశారు. ఇదే గ్రామ మార్కెట్ వీధికి నిత్యం పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. కొందరు భవన నిర్మాణ యజమానులు ఇష్టారాజ్యంగా రహదారికి అడ్డంగా భవన నిర్మాణం చేపట్టడంతో ఆ రహదారి గుండా పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. కొందరు టీడీపీ నాయకుల అండతో గ్రామానికి చెందిన వారు భవన నిర్మాణ సామగ్రి వేయటంపై పలువురు మండిపడుతున్నారు. పంచాయతీ సీసీ రోడ్డుపై అడ్డంగా సామగ్రి వేయడంపై పలువురు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి రహదారిపై వేసిన భవన నిర్మాణ సామగ్రిని తొలగించి, రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కలివరంలో రహదారిపై అడ్డంగా వేసిన భవన నిర్మాణ సామగ్రి

కాలువ ఇలా..

సాగునీరు అందేదెలా?



జగ్గయ్యపేట సమీపంలో పిచ్చిమొక్కలతో నిండిన రంగసాగరం ప్రధాన కాలువ

- పిచ్చి మొక్కలతో నిండిన రంగసాగరం కాలువ
- మరమ్మతులకు నోచుకోని వైనం
- సాగునీటికి ఇబ్బందులు

సారవకోట: మండలంలోని అర్లి గ్రామానికి సమీపంలో 350 ఎకరాల్లోని (ఒడిశాలోని పర్లాకిమిడి రాజులు కాలంలో తవ్వారు) రంగసాగరం కాలువ నేడు పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఈ వేసవిలోనైనా మరమ్మతులు చేపట్టి రానున్న ఖరీఫ్లో వరిసాగుకు అయినా నీరు అందించాలని ఆయకట్టు రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ కాలువ ద్వారా జగన్నాథపురం, బురుజువాడ, జగ్గయ్యపేట, కోనవానిపేట, గొర్రిబంద, సారవకోట, కొత్తూరు, అగదల, గోపాలపురం, బద్రి, లక్ష్మీపురం తదితర గ్రామాల్లోని సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరు అందుతుంది. అప్పట్లో నిర్మించిన ప్రధాన కాలువతోపాటు చిన్న కాలువలలో కనీసం ఒక్కనాడైనా పూడికలు తొలగించే దాఖలాలు ఇప్పటివరకు లేవు. కాలువ లోతు తగ్గిపోవడంతోపాటు ఆక్రమణలకు గురవుతుంది. ఖరీఫ్లో శివారు గ్రామాలకు సాగునీరు అందడం లేదు. ఈ కాలువ లోతు పెంచడంతో పాటు అక్కడక్కడ చప్టాలు నిర్మిస్తే మరింత వ్యవసాయ భూమికి సాగు నీరు అందుతుందని రైతులు చెబుతున్నారు.

పూడికలు తొలగించాలి



ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన రంగసాగరం ప్రధాన కాలువలో పూడికలు తొలగిస్తే శివారు ప్రాంతాలలో ఉన్న వ్యవసాయ భూములకు సాగు నీరు అందుతుంది. దీనిపై అధికారులు స్పందించి కాలువను బాగు చేయాలి.

– బాడాన కృష్ణారావు, రైతు, కొత్తూరు, సారవకోట మండలం


సీహెచ్ఓగా పార్వతి

సారవకోట: సారవకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్ఓగా సి.హెచ్.పార్వతి గురువారం విధుల్లో చేరినట్లు వైద్యులు దేవిక తెలిపారు. ఇక్కడ సీహెచ్ఓగా విధులు నిర్వహించిన పద్మావతి గత నెలలో పదవీ విరమణ పొందారు. ఆమె స్థానంలో ఉద్యోగోన్నతిపై అల్లూరి సీతారామ రాజు జిల్లా నుంచి పార్వతి ఇక్కడకు వచ్చారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

కొత్తూరు: మండలంలో బమ్మిడి గ్రామంలో 8 మద్యం బాటిళ్లతో అన్నెపు ఫల్గుణరావు బుధవారం రాత్రి పట్టుబడినట్లు ఏఎస్ఐ గోవిందరావు గురువారం తెలిపారు. గోవిందరావు తన షాపులో అక్రమంగా మద్యం బాటిళ్లు విక్రయిస్తుండగా పట్టుబడినట్లు ఏఎస్ఐ చెప్పారు. గోవిందరావును అరెస్టు చేశామన్నారు. బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులతో ఎమ్మెల్యే కూన రవికుమార్

సరుబుజ్జిలి: క్రీడలతో మానసిక ఉల్లాసం వృద్ధి చెందుతుందని స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో నిర్వహించనున్న కిల్లి అప్పలనాయుడు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ను గురువారం ప్రారంభించారు. డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, స్థానిక నాయకులు, యువకులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

కొత్తూరు: సారా, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసైతే జీవితాలు అంధకారం అవుతాయని స్థానిక సీఐ చింతాడ ప్రసాదరావు అన్నారు. మండలంలోని కడుము గ్రామంలో గురువారం రాత్రి సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. మైనర్లకు బైక్లు ఇచ్చేవారి లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సర్పంచ్ రామారావు, ఎంపీటీసీ సభ్యుడు గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రసాదరావు

అన్నదానం

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డు బైరిశాస్త్రులపేటలో గల ఎండల మల్లికార్జున స్వామి 72వ కల్యాణ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. గ్రామానికి చెందిన లంక ఆదినారాయణ, శారద, మొండేటి గోవిందరాజు, తారకేశ్వరి దంపతులతో ఆలయంలో కల్యాణ మహోత్సవం చేపట్టారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో..

ఆమదాలవలస పట్టణంలోని మోణింగి వారి వీధిలో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయం ఎనిమిదో వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. వేదపండితులు భాస్కరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



ఎండల మల్లికార్జున స్వామి వద్ద ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఆధ్యాత్మిక భావాలు పెంపొందించాలి

నరసన్నపేట: పిల్లలకు ఆరోగ్య సూత్రాలతోపాటు ఆధ్యాత్మికత భావాలు పెంపొందించాలని చిన్మయ్ మిషన్ స్వామిజీ పరమాత్మానంద అన్నారు. స్థానిక బొడ్డవలసలోని చిన్మయ్ మిషన్లో ఆధ్వర్యంలో గత వారం రోజులుగా విద్యార్థులకు ఆధ్యాత్మికం, ఆరోగ్యంపై ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. గురువారంతో ఈ కార్యక్రమం ముగిసింది. దీంట్లో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పరమాత్మానంద స్వామిజీ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల పట్ల బాధ్యతగా ఉండాలన్నారు. వారిలో ఆధ్యాత్మికత పెంపొందిస్తే ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. ఆరోగ్య లక్షణాలు, యోగాపై అవగాహన కల్పించాలన్నారు. కె.ఎల్.ఎస్.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు తొలగించాలని డిమాండ్



ధర్నా చేస్తున్న హౌసింగ్ బోర్డ్ కాలనీ మహిళలు

పాతపట్నం: మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలోని మద్యం షాపును తొలగించే వరకు ధర్నా చేస్తామని కాలనీ వాసులు, మహిళలు పేర్కొన్నారు. గురువారం మూడో రోజు ధర్నాను కొనసాగించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ తక్షణమే ఇక్కడ నుంచి మద్యం దుకాణం తొలగించాలన్నారు. జనవాసాల మధ్య మద్యం దుకాణం పెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎక్సైజ్ అధికారులు షాపును మార్చుతామని మాట ఇచ్చి, ఇంతవరకు మార్చలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.